క్లుప్తంగా

శాకంబరిగా వాసవీ మాత



అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో వాసవీ మాతను శుక్రవారం శాకంబరిగా అలంకరించారు. శుక్రవారం పూజలో భాగంగా అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వాసవీ కన్యకాపరమేశ్వరి, లలిత అమ్మవార్ల అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు.

సత్తెనపల్లి(ముప్పాళ్ల): మండలంలోని పెదమక్కెనలోని గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. సకాలంలో వర్షాలు, పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ కూరగాయలతో అమ్మవారిని అలంకరించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఇన్‌చార్జి ఎంఈఓగా ప్రసాదరావు

క్రోసూరు: క్రోసూరు మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా ఏకుల ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎంఈఓ జి.ఏసురత్నం బదిలీపై వెళ్లారు. ఎంఈఓను ఎంపీపీ పి.కోటయ్య, ఎస్టీయూ ఏపీ నాయకులు ఎస్.రాఘవ శుభాకాంక్షలు తెలిపారు.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



ముప్పాళ్ల: వాహనం ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయనే సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లగా, రోడ్డు పక్కనే పడి గాయాలతో పడి ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు మతిస్థిమితం సరిగ్గా ఉండదని, యాచకుడిగా తిరుగుతుంటాడని, గోదావరి జిల్లాల యాస మాట్లాడుతుంటాడని స్థానికులు చెబుతున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు ముప్పాళ్ల ఎస్‌హెచ్‌ఓ 9440796233, 08641-242433లకు సమాచారం ఇవ్వాలని కోరారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఇమామ్ తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తాం




మాచర్ల రూరల్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు, సలహాలు అందించాలని ఎన్నికల ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఎ.శ్రీరామచంద్రమూర్తి కోరారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఓటర్ల జాబితాపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఈ నెల 21 నుంచి వచ్చే నెల 28 వరకు ఇంటింటికి బూత్ లెవల్ అధికారులు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో మరణించిన వారిని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారిని, ఒక్కరికి రెండు ఓట్లు ఉన్న వారిని గుర్తించి పేర్లు తొలగించనున్నట్లు తెలిపారు. 18సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కుర్రా వెంకటేశ్వర్లు, టీడీపీ, బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు కె.శివారెడ్డి, దుర్గారావు, నాసరయ్య, సైదులు, మస్తాన్, తహసీల్దార్లు మహమ్మద్ హుసేన్, రమేష్‌కుమార్, కోటేశ్వరరావు నాయక్, జి.శ్రీనివాసరావు, కమిషనర్ రమణ బాబు, డీటీలు షేక్ బాషా, రాజశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం 143 మంది ఎంపిక

గురజాల: పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధులకు సంక్షేమ శాఖ, భారత ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు పరీక్షలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 143 మంది ఉపకరణాలు అవసరమైనట్లు వైద్యులు గుర్తించారు. పుట్టుకతో మూగ, చెవిటి, వంటి విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి అవసరమైన ఉపకరణాలు అందించడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి చేతులమీదుగా భోజనం అందించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ గబ్రూనాయక్, ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్, కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, భవిత కేంద్రం ఐఈఆర్టీలు ఏ విజయలక్ష్మి, ఝాన్సీ రాణి, సమగ్ర శిక్ష, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ తదితరులున్నారు.

ప్రతి గడపకు చేరువైన సేవలు

- గ్రామ సచివాలయాలతో ఇంటింటికి సంక్షేమ పథకాలు
- అవినీతి రహితంగా లబ్ధి



అచ్చంపేట: గ్రామ సచివాలయాలతో ప్రజలకు అవసరమైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో విద్యార్థులకు అవసరమైన సరిఫికెట్లు కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం వేకువజామునే క్యూలైన్లు చూశాం. మద్దతు ధర కోసం మార్కెట్ యార్డుల్లో పడిగాపులు పడిన రోజులు.. ధర లేక కూరగాయాలను రోడ్డుపై పోసిన రోజులు ఎరిగినోళ్లం మనం. సంక్షేమ పథకాల కోసం నాయకుల దయాదాక్షణ్యాల కోసం తిరిగిన కాళ్లనూ చూశాం.. ఇలాంటి బాధలను పాదయాత్రలో తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. 50 కుటుంబాలకు వలంటీర్‌ను ఏర్పాటు చేసి అన్నీ రకాల సేవలను ప్రజలకు చేరువ చేశారు.



చింతపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

ప్రజల వద్దకే పాలన

సచివాలయాల ఏర్పాటుతో ప్రజల వద్దకే పాలన నినాదం నిజమైంది. గత పాలకులు ఎప్పుడో ఒక సారి చుట్టపు చూపుగా వచ్చి గ్రామాలను సందర్శించి, ప్రజల వద్దకే పాలన ఇస్తున్నామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చేవారు. కాని జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాతనే పక్కాగా ఇంటి వద్దనే ప్రజలకు కావలసిన సదుపాయాలు లభిస్తున్నాయి.. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు ప్రజలు జేజేలు కొడుతున్నారు.

మా కుటుంబంలో వెలుగులు



నేను ఎస్సీ కుటుంబానికి చెందిన నిరుపేదను. సెంటు భూమికూడా లేదు. డ్రైవరుగా వెళ్లేవాడిని. వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ కూడా భారమైంది. ఉపాధి కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా.. 45 శాతం సబ్సిడీతో బస్సు మంజూరు చేశారు. 55శాతం బ్యాంకు వారు లోను ఇచ్చారు. బస్సు కొనుక్కున్నా. ఆ బస్సును ఆర్టీసీకి అద్దెకు ఇచ్చా.. వచ్చే అద్దెతో బ్యాంకు వారికి కిస్తీలు చెల్లిస్తున్నా. త్వరలోనే బస్సు యజమానిని అవుతానన్న నమ్మకం ఉంది. నాకు ముగ్గురు పిల్లలు. ముగ్గుర్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నా.. అమ్మఒడి ఇస్తున్నారు. మా అమ్మాయి ఇటీవలనే క్రోసూరులో సీఎం జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక అందుకుంది. ఇంతకంటే మాకు ఏం కావాలి. మేము బతికిన్నంతకాలం జగనన్నకు రుణపడి ఉంటాం.

–కొంపెర్ల రోశయ్య, చింతపల్లి

వలంటీర్ వల్లే నా భర్త నాకు దక్కాడు



నా భర్త తోట వెంకటేశ్వర్లుకు రెండు కిడ్నీలు దెబ్బ తిన్నాయి. బతకడం కష్టమని చెప్పారు. మా గ్రామ సచివాలయ సిబ్బంది సూచనల మేరకు మా గ్రామ వలంటీర్లు బలరాం గుప్తా మమ్మల్ని మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్యశాలకు తీసుకెళ్లి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించారు. ఇప్పుడు డయాలసిస్ పెన్షన్ కింద నెలకు రూ.10వేలు ఇస్తున్నారు. ఫ్రీగా డయాలసిస్ కూడా చేస్తున్నారు. నాకు ఇద్దరు మగ పిల్లలు. వారిద్దరిని గ్రామంలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివిస్తున్నా. అమ్మఒడి నాలుగేళ్లుగా ఇస్తున్నారు. ఇద్దరికి జగనన్న కానుకలు అందాయి.

– తోట అంజలి, గృహిణ, మాదిపాడు

వలంటీర్లకు వందనం

మంచంలో ఉన్నా ధైర్యం వచ్చింది..

వలంటీర్ కంభంపాటి దినేష్. అమరావతి రాజీవ్‌కాలనీలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. సకాలంలో సేవలందిస్తూ అందరికి ఆప్తుడయ్యాడు. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా వెంటనే కార్యాలయాలకు వెళ్లి తీసుకొచ్చి ఇస్తున్నాడు. ఎటువంటి ఆస్పత్రి అవసరం వచ్చిన అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నాడు. అనారోగ్యంతో పూర్తిగా మంచానికి పరిమితమైన కారసాల విజయరత్నంకి ధైర్యం వలంటీర్ అయ్యాడు. ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు అందించటమే కాకుండా తమకు అన్ని విధాల సాయం అందిస్తున్నాడు. 'తాను చాలా కాలంగా మంచంలో నుంచి లేవలేని స్థితిలో ఉంటే ఒకటో తారీఖున తెల్లారుజామున దినేష్ వచ్చి పింఛన్ డబ్బు ఇచ్చి ధైర్యం చెబుతాడని' విజయరత్నం అభినందపూర్వకంగా కితాబు ఇచ్చాడు.



పింఛన్ అందిస్తున్న వలంటీర్ దినేష్(ఫైల్)

అన్ని విధాల సాయంగా..

రాయి రేవతి, అమరావతి పల్లపు వీధి కాలనీలో వలంటీర్‌గా పనిచేస్తోంది. జగనన్న అందించిన పింఛన్ తెల్లవారుజామునే అందించడంతో వృద్ధులకు సహాయకారిగా మరిపోయింది. ఏ చిన్న సందేహం వచ్చిన ఆమెను సంప్రదించడం కాలనీ వారికి అలవాటుగా మారిపోయింది. కరోనా టైంలో కూడా పింఛన్ ఇవ్వటం మందులు సరఫరా చేయటం వంటివి చేసి ఆదుకుందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన కాగితాలు తెచ్చి అప్లికేషన్ పెట్టివరకు అన్ని రేవతే చూసుకుంటుందని వృద్ధదంపతులు చెబుతున్నారు.



వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ రేవతి(ఫైల్)

–అమరావతి

జగనన్న సురక్షతో అర్హులకు మేలు

- ఎంపీపీ కోటయ్య

క్రోసూరు: జగనన్న సుర క్షశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పి.కోటయ్య అన్నారు. మండలంలోని అనంతవరం, ఆవులవారిపాలెం గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాల నిర్వహించారు. ఆవులవారిపాలెంలో ఎంపీడీఓ బి.మహేష్, అనంతవరంలో తహసీల్దార్ ఎండీ జియావుల్‌హక్ పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతవరంలో 131 అర్జీలు రాగా 50 మందికి సర్టిఫికెట్లు, ఆవులవారిపాలెంలో 178 మంది అర్జీలు అందించగా వాటిలో 134 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, అనంతవరం గ్రామ సర్పంచి పిల్లకతువుల రామయ్య, ఆవులవారిపాలెం సర్పంచి కె.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, గార్లపాటి దాసు, అనుముల కోటిరెడ్డి, ఎంపీటీసీ వేణుగోపాలరెడ్డి, పట్టీల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు: స్థానిక సచివాలయం -1లో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అర్హులకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్నారై భవనం సుభాష్‌చంద్రబోస్ రెడ్డి, సర్పంచి పరసా అంజమ్మ, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, కో ఆప్షన్ సభ్యుడు డాక్టర్ షేక్ హుసేన్, మార్నెళ్ల శ్రీనివాసరావు, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ కేసరి నర్సింహారెడ్డి, పరసా సాంబయ్య, సర్పంచి భావన్నారాయణ పాల్గొన్నారు.

328 ధ్రువీకరణపత్రాల పంపిణీ

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె సచివాలయ పరిధిలోని కర్లపూడిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంకు ఎంపీడీఓ మాధురి అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, గ్రామ సర్పంచి పద్మజా, ఉపసర్పంచి ప్రకాష్, ఎంపీటీసీ బండ్లమూడి రాంబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు 328 ధ్రువీకరణ పత్రాలు మంజూరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ జియావుల్‌హక్, ఈఓపీఆర్డీ శివరామయ్య



కర్లపూడిలో లబ్ధిదారు కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

289 ధ్రువీకరణ పత్రాలు అందజేత

రాజుపాలెం: గ్రామంలోని సమస్యలను అక్కడికక్కడే తక్షణమే పరిష్కరించేందుకే జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని బలిజేపల్లి, పెదనెమలిపురి గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో రెండు గ్రామాలలో 289 మంది సమస్యలను విన్నవించుకోగా 289 సమస్యల దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు ఏ నళిని, సర్పంచులు గొతుకట్ల జ్యోతి, కొర్రకూటి వెంకాయమ్మ, ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, ఎంఈఓ మల్లికార్జునశర్మ, ఏపీఎం సునీత పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి

- రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు
- దేవరంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

రాజుపాలెం: సంక్షేమ సంస్కరణలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సరికొత్త ఒరవడిని సృష్టించారని రాష్ట్ర జలవనరుల శాఖ అంబటి రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం నెమలిపురి గ్రామ సచివాలయం-2 పరిధిలోని దేవరంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారికి అందుతున్న ప్రభుత్వ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల సేవలపై ఆరా తీశారు. స్థానికంగా ఉన్న సమస్యలను గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు,అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ సునీతశ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, తహసీల్దారు నళిని, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ పులిబండ్ల అశోక్, సర్పంచి పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, దేవరంపాడు దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, కుప్పాల పిచ్చియ్య, సీహెచ్ శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



దేవరంపాడులో పథకాలను వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

శ్రీసరస్వతి శిశుమందిర్‌లో బాలికావిద్య కార్యక్రమం

సత్తెనపల్లి(ముప్పాళ్ల): పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బాలికావిద్య కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి చలువాది చినసత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు అరుణకుమారి పాల్గొని భారతీయమనోవిజ్ఞానశాస్త్రం గురించి వివరించారు. మన్నవ ధనలక్ష్మి, విభాగ్ కార్యదర్శి అబ్బూరి సత్యనారాయణ మాట్లాడారు. వైద్యులు అరుణకుమారిని ఘనంగా సత్కరించారు. సభ్యులు జేపీఎస్‌శాస్త్రి, పాఠశాల కమిటీ సభ్యులు దేవరశెట్టి రవికుమార్, చలువాది హరికుమార్ పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ



క్రోసూరు: కిరాణాషాపులు, కూరగాయల షాపులను తూనికలు, కొలతల శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ షేక్ సైదా శుక్రవారం తనిఖీ చేశారు. కొలతల్లో వ్యత్యాసం ఉండడంతో నిర్వాహకులపై కేసులు రాశారు. పలు రకాల ప్యాకింగ్‌లపై, గిఫ్ట్ ఆర్టికల్స్‌పై ఎమ్మార్పీ లేకుండా విక్రయిస్తుండడంతో కేసులు రాశారు. పలువురికి రూ.50 వేలు జరిమానా విధించినట్లు సైదా తెలిపారు. మోసలకు పాల్పడితే 0863-2223202, 9885127512 ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

జగనన్న సురక్ష అర్జీలు సకాలంలో పూర్తి చేయాలి

సత్తెనపల్లి(ముప్పాళ్ల): జగనన్న సురక్షలో భాగంగా అందిన అర్జీలను సకాలంలో పూర్తి చేసి అర్జీదారులకు అవసరమైన సేవలను అందించాలని తహసీల్దార్ సురేష్‌నాయక్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ కౌలు రైతులకు అందించే కార్డుల లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. మండలంలో 2,600 మందికి కార్డులు ఇవ్వాల్సి ఉండగా కేవలం 1461 మందికి మాత్రమే కార్డులు అందించామని, మిగిలిన కార్డులు కూడా అందించాలన్నారు. సచివాలయంలో నీటితీరువా వసూలు లక్ష్యాలు పూర్తి చేయాలని కోరారు. భూరికార్డుల స్వచ్ఛీకరణలో ప్రతి గ్రామం సర్వే నంబర్లు పరిశీలించి రెవెన్యూ రికార్డులు సరి చేయాలని చెప్పారు. పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి మ్యుటేషన్స్ సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేర ఈ నెల 21వ తేదీన ప్రతి బూత్‌లెవల్ అధికారి ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌నాయక్

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సత్తెనపల్లి(ముప్పాళ్ల): ఎస్సీలకు శ్మశాన వాటికల సమస్యను గుర్తించి ఎకరా భూమిని కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయం అని దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలకాజైపాల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ భూమిలేని దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన 46,935 మందికి 54,129.45 ఎకరాల భూ పంపిణీ కోసం, దళితులకు శ్మశాన వాటిక కోసం ప్రతి గ్రామంలో ఎకరా భూమిని కేటాయిస్తూ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రిమండలి తీర్మానం చేయడం గొప్ప నిర్ణయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగూర్ మీరాన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, పట్టణ కన్వీనర్ సహారా మౌలాలి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు యాసారపు బాబూరావు, ఎస్సీ సెల్ మండల నాయకులు నందిగం యలమంద, ఆదాం, చిలక రమణయ్య, మోషే, గొల్లపల్లి నాగేశ్వరరావు, బట్లూరు కోటేశ్వరరావు, చిలకడాని, దార్లకొండలు, గుంటూరు నతానియేలు, పైర్ల సుబ్బారావు, బొక్కా యోహాను, చిలక నాగేశ్వరరావు, పెద్దింటి నాగేశ్వరరావు, నందిగం దావీదు, బొగ్గవరపు గోపయ్య, కూచిపూడి సైమన్ పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన వారికి అభినందనలు

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు ఎంపిక

క్రోసూరు: క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్ నుంచి ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ సుజన్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఎం.లక్ష్మీరత్నమాణిక్యం నూజివీడు, బి.రేణుక, టి.వీరేంద్ర ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికయ్యారని తెలిపారు. తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావటంపై పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక

ముప్పాళ్ల: మండలంలోని మాదలలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని మల్లాడి గౌతమి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మిరియాల వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు చెప్పారు. గౌతమిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నకరికల్లు నుంచి..

నకరికల్లు: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి సత్తా చాటారు. మొత్తం ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించగా కుంకలగుంట ఉన్నతపాఠశాల విద్యార్థులు ముగ్గురు ఉన్నారు. అందులో కొర్లపాటి బాలచౌడయ్య, పులి జాహ్నవి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించగా నందిగం జస్సికా నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించింది. గుండ్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.జి.జాన్‌సైదా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ, కండ్లకుంట ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్ గోపాలకృష్ణ ఒంగోలు ట్రిపుల్ ఐటీ, దేచవరం ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎస్.మహేష్‌బాబు శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. విద్యార్థులకు ఎంఈఓ బాబురెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నెమలిపూరి నుంచి ..

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ మల్లికార్జునశర్మ శుక్రవారం తెలిపారు. బి.రోణిక, ఏ రాజేష్ ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో సీట్లు వచ్చినట్లు వివరించారు. విద్యార్థులను సర్పంచి కొర్రకూటి వెంకాయమ్మ అభినందించారు.

నేడు వైఎస్సార్ సీపీ బీసీల ఆత్మీయ సమావేశం

క్రోసూరు: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ జంగాకృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. అదే విధంగా సాయంత్రం మండలంలోని దొడ్లేరు గ్రామ సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వివరించారు.

రోటరీ క్లబ్ 22వ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పిడుగురాళ్ల: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఐపీడీజీ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్‌లు హాజరయ్యారు.

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు క్లబ్‌ను అభివృద్ధి చేయాలని, అదేవిధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించి క్లబ్‌ను ముందుకు నడిపించాలని ఆయన తెలియజేశారు. నూతన ప్రెసిడెంట్‌గా ఆత్మకూరి గురవయ్య, సెక్రటరీగా కొత్త రవి, ట్రెజరర్‌గా జోకా బ్రహ్మంలను తాళ్ల రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన సభ్యులుగా నీరుమళ్ల రాజేష్, కొత్త హనుమంతరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు భవనాశి యల్లారావు, కాకుమాను శ్రీనివాసు, కోట రమేష్, డాక్టర్ పి. విష్ణుబాబు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

కనక దుర్గమ్మకు ఆషాఢ మాస బోనాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని కనక దుర్గ అమ్మవారికి ఆషాఢ మాస బోనాలను మహిళలు మెయిన్ సెంటర్‌లో బోనాలను తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ పూజారి అమ్మవారికి విశేష ద్రవ్యాలతో పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి హాజరైన మహిళా భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



అమ్మవారికి బోనాలను తీసుకుని వస్తున్న మహిళలు